కులగణనతో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం


సీఎంను కలిసిన సాయికుమార్

అబిడ్స్: కులగణనతో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం జరుగుతుందని రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా కులగణనను తెలగాణ రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిందని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ..బలహీన వర్గాలు, మైనార్టీల ఆకాంక్షలకు అనుగుణంగా ఎంతో పకడ్బందీ ప్రణాళికలతో కులగణన జరిగిందన్నారు.

'కార్వాన్‌లో బీజేపీ పటిష్టంగా ఉంది'


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ/జియాగూడ: కార్వాన్ డివిజన్‌లో బీజేపీ పటిష్టంగా ఉందని బీజేపీ అధ్యక్షుడు ఉద్దతి జగదీష్‌కుమార్ అన్నారు. గురువారం కార్వాన్ శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో బీజేపీ పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రోజు రోజుకూ ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ అసమర్థ పాలనపై ప్రజలు విసిగెత్తిపోయారన్నారు. అదే విధంగా ప్రధాని నరేంద్రమోదీ సుస్థిర పాలనపై కూడా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నా రు. ఈ సందర్భంగా బీజేపీ డివిజన్ మాజీ అ ధ్యక్షుడు దొర్తుల శ్రీనివాస్, కార్వాన్ జిల్లా కౌన్సి ల్ సభ్యుడు గంజి రఘునాథ్‌ను సన్మానించారు.

మహిళా శక్తికి ప్రోత్సాహం అందించాలి


ఎమ్మెల్సీ కవితకు మెమొంటోను అందజేస్తున్న కరిష్మాసింగ్ తదితరులు

అబిడ్స్: ఎమ్మెల్సీ కవితను బీఆర్ఎస్ నాయకురాలు కరిష్మాసింగ్ కలిసి మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మార్చి 8న మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొని మహిళా శక్తికి ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు. యంగ్ ఫిమేల్ ఎడ్యుకేషన్ అచ్యువర్ అవార్డును అందజేసి సత్కరిస్తామని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పప్పు మాత్రే మనీష్ సింగ్, సంజన సింగ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తప్పించుకునేందుకు యత్నం

పోలీసులకు చిక్కిన మందుబాబులు

బంజారాహిల్స్: మద్యం మత్తులో కారు నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ నుంచి తప్పించుకునే క్రమంలో ఎదురుగా ఆగిన కారును ఢీకొట్టిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..బాచుపల్లికి చెందిన పాలమాకుల మృదుల్ (20), చింతల్‌కు చెందిన రితుల్‌కుమార్‌రెడ్డి (22), కొంపల్లికి చెందిన అజయ్ మంతెన (22), గుండ్లపోచంపల్లికి చెందిన మెన్నేని అజయ్‌రావు (21), బహదూర్‌పురాకు చెందిన జక్కుల వికాస్(24) బుధవారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని ఓల్ట్ పబ్‌లో మద్యం తాగి రాత్రి 11.30 సమయంలో టీఎస్ 07 ఈసీ 1717 కారులో తిరుగు ప్రయాణమయ్యారు. పాలమాకుల మృదుల్ కారు నడుపుతున్నాడు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని డైమండ్ హౌస్ వద్ద ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా సిద్ధార్థ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తన కారులో వెళ్తూ ట్రాఫిక్ పోలీసులు ఆపడంతో కారును నిలిపాడు. అదే సమయంలో వచ్చిన మృదుల్ డ్రంకెన్ డ్రైవ్ చూసి తప్పించుకునేందుకు వెనక్కి తిప్పేందుకు ప్రయత్నిస్తూ సిద్ధార్థ కారును ఢీకొట్టాడు. వీరంతా పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు.

బంగారు ఆభరణాలు చోరీ

బంజారాహిల్స్: కుటుంబంతో కలిసి బయటకు వెళ్లొచ్చే సరికి బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని కిమ్టీ బంజారా హైట్స్‌లో నివసించే దీపక్‌కుమార్ కిమ్టీ గత నెల 22న కుటుంబంతో కలిసి బయటకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికొచ్చే సరికి వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. డెస్క్‌పై ఉంచిన తొమ్మిది గ్రాముల బంగారం, వజ్రం ఉంగరం కనిపించలేదు. ఇంట్లో పనిచేసే రాహుల్ కుమార్‌ను ప్రశ్నించగా తెలియదని చెప్పాడు. అయితే.. కొన్ని రోజులకు రాహుల్ చెప్పకుండా స్వస్థలమైన బిహార్‌కు వెళ్లిపోయాడు. అతడిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కళ తప్పిన కంచర వృత్తి

- కంచర వృత్తిపై ఆధారపడిన జియాగూడలోని వందలాది కుటుంబాలు
- ప్లాస్టిక్, స్టీల్‌తో కనుమరుగవుతున్న ఇత్తడి వస్తువులు
- గతంలో పెంబర్తి, తిరుపతిలలో కేంద్ర ప్రభుత్వం ద్వారా శిక్షణలు


రాగి చెంబుపై అష్టలక్ష్మీలను దించుతున్న కళాకారుడు


లక్కపై అచ్చువేస్తున్న కంచర కార్మికుడు

జియాగూడ: కంచర వృత్తి కళ తప్పింది. కంచెర వృత్తి దారుల ఇత్తడి, రాగి వస్తువుల తయారీతో కళకళలాడే జియాగూడ కంచెర బస్తీతో పాటు ఇతర ప్రాంతాలు నేడు బోసిపోతున్నాయి. జియాగూడలో వందేళ్ల నుంచి వందలాది కుటుంబాలు ఇత్తడి, రాగి వస్తువులు తయారు చేసి ఉపాధి పొందుతున్నాయి. అప్పట్లో ప్రతి వస్తువు ఇత్తడితో చేసినవి వాడుకలో ఉండగా క్రమేణా స్టీలు తర్వాత ప్లాస్టిక్ వస్తువుల వాడకం పెరగడంతో ఇత్తడి వస్తువుల కొనుగోలు పూర్తిగా తగ్గింది. స్టీలు, ప్లాస్టిక్ చవక ధరలకే లభించడం వల్ల ఇత్తడితో తయారయ్యే బిందెలు, బకెట్లు, చెంబులు, ప్లేట్స్, గ్లాసులు, గిన్నెలు, గరిటెలు వాడకం మానేశారు. దీంతో అనాది నుంచి వస్తున్న కంచెర కుల వృత్తి కనుమరుగవుతోంది.


ఇత్తడితో తయారైన విగ్రహాలు, అచ్చులు

నాటి నుంచి కంచర కులస్తుల చేతిలో నగిషీ, నక్షి కళ..

జియాగూడ కంచెర బస్తీతోపాటు వడ్లబస్తీ, పుకట్‌నగర్, దుర్గానగర్, లక్ష్మీనర్సింహానగర్ ప్రాంతాల్లో స్థిరపడిన కంచర కులస్తులు కుటీర పరిశ్రమల వలె కుటుంబసభ్యులు వస్తువుల తయారీలో భాగం పంచుకుంటారు. ప్రస్తుతం శుభకార్యాలకు, పూజా కార్యక్రమాలకు ఇత్తడి, రాగి, వస్తువులు తప్పనిసరిగా కావడంతో తయారవుతున్నాయి. ముఖ్యంగా నక్షి చెంబులు, చిన్న బిందెలు, తాంబలాలు, ఫ్లవర్ పాట్స్, దేవుళ్ల కిరిటాలు, అలంకరణ వస్తువులు, తదితరవి వీరి చేతుల్లో నగిషీ, నక్షికళలతో నేటికి రూపు దిద్దుకుంటున్నాయి. కంచెర కులస్తులు చేస్తున్న వృత్తి ఆదరణ తగ్గినప్పటికీ ఇతర రంగాల్లో వెళ్లలేక ఆర్థికంగా చతికిలపడ్డారు.


నగిషీ కళతో దేవుడి కిరీటం

ప్రభుత్వ ప్రోత్సాహం లేక..

గతంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తిరుపతి, తెలంగాణలోని పెంబర్తిలలో మెటల్ క్రాఫ్ట్, ఆర్ట్ క్రాఫ్ట్ అని ఏడాది పాటు ప్రత్యేక శిక్షణలు ఉచితంగా ఇచ్చేంది. ట్రైనింగ్ పూర్తి చేసుకొని సర్టిఫికెట్ ఉంటే బీసీ కార్పొరేషన్, ఇతర వాటిలో రునాలు సైతం లభించేవి. ప్రస్తుతం ట్రైనింగ్ లేక, రుణాలు లభించక, అప్పుచేసి పెట్టిన పెట్టుబడి సరిపోక తీరా నష్టాలు చూస్తున్నామని పలువురు కంచెర కులస్తులు వాపోతున్నారు. ఇత్తడి రాగి వస్తువులు నిత్యావసర వస్తువులుగా గాక కేవలం వివాహాలు, శుభకార్యాలకు, ఆలయాలకు మాత్రమే ఇత్తడితో చేసిన వస్తువుల అవసరం ఉండడం వల్ల రెగ్యులర్ విక్రయాలు లేక చేసిన వస్తువులతో ఎదురు చూడాల్సి వస్తుందని పలువురు తెలిపారు.

ఇత్తడి వస్తువుల వాడకం శ్రేష్టం..



ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న సిల్వర్, స్టీల్, ప్లాస్టిక్ వస్తువులు ఎంతో హానికరం ఇత్తడి వస్తువుల వాడకం ఎంతో శ్రేష్ఠమైనదిగా ప్రజలు గుర్తించాలి. ఆలయాలకు, శుభకార్యాలతో పాటు నిత్యావసర వస్తువులుగా వాడాలి.

– పూనమ్‌చారి, కళాకారుడు

బీసీ కులగణనలో కంచర వృత్తికి ప్రాధాన్యమివ్వాలి..



ప్రభుత్వం బీసీ కులగణలో కంచర వృత్తి దారులకు ప్రాధాన్యమివ్వాలి. శిక్షణలు ఇచ్చి, రుణాలు అందించి ఆర్థికంగా ఎదగడానికి లేపాక్షి తరహాలో అన్ని జిల్లాలో ప్రభుత్వ పరంగా దుకాణాలు కేటాయించి వారి ఆర్థికాభివృద్ధికి సహకరించాలి.

– మంగి కిషోర్ కుమార్, బీఆర్ఎస్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు

ఆర్యవైశ్య మహాసభకు ఎన్నికలు నిర్వహించండి


సంబు వెంకటరమణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహా సభకు వెంటనే చట్టప్రకారం ఎన్నికలు నిర్వహించి రాష్ట్రంలోని లక్షలాది మంది ఆర్యవైశ్యులకు న్యాయం జరిగేవిధంగా కృషి చేయాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సంబు వెంకటరమణ డిమాండ్ చేశారు. 13 ఏళ్లుగా ఆర్యవైశ్య మహాసభకు ఒకే వ్యక్తి అధ్యక్షుడిగా ఉండడం ఎంతో బాధాకరమన్నారు. గురువారం ఆయన లక్డీకాపూల్‌లోని సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ..ప్రతి రెండు సంవత్సరాలకు చట్ట ప్రకారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆర్యవైశ్యుల ఎన్నికలు జరుగుతుండగా రాష్ట్ర ఆర్యవైశ్య మహా సభకు మాత్రం ఎందుకు ఎన్నికలు జరగడం లేదన్నారు. ఆర్యవైశ్య మహాసభ నిబంధనల ప్రకారం వెంటనే ఎన్నికలు జరపాలన్నారు. ఒక వ్యక్తి 13 ఏళ్ల పాటు ఒకే పదవిలో కొనసాగితే ఆర్యవైశ్యులకు ఎలా న్యాయం జరుగుతుందని సంబు వెంకటర రమణ ప్రశ్నించారు. వెంటనే ఎన్నికలు జరిపి చట్ట ప్రకారం ఆర్యవైశ్యులకు న్యాయం జరిగే విధంగా మహా సభ చర్యలు తీసుకోవాలన్నారు.

కేటీఆర్‌పై అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి


ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ప్రదీప్ రాజ్, కోటి శైలేష్ కురుమ

అఫ్జల్‌గంజ్: సోషల్ మీడియాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నవారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బేగంబజార్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కోళ్ల ప్రదీప్‌రాజ్, గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు కోటి శైలేష్ కురుమ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగం రవీందర్‌కు వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో కేటీఆర్‌పై దిగజారుడు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వారిపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లను విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

డబీర్‌పురా: నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లను తయారు చేస్తూ విక్రయిస్తున్న ఇద్దరిని డబీర్‌పురా పోలీసులు, సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం..శాలిబండకు చెందిన అబ్దుల్ ఖాదర్ ఆలియాస్ ఖాదర్ (47), డబీర్‌పురా ఫర్హత్‌నగర్‌కు చెందిన మహ్మద్ షకీల్ (37)లు నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లను తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న డబీర్‌పురా పోలీసులు, దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం యాకుత్‌పురా నుంచి న్యూ రోడ్డు చంచల్‌గూడ వైపు వెళుతుండగా వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి కాకతీయ యూనివర్సిటీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ, నేషనల్ బోర్డు ఆఫ్ సెకండరీ అండ్ సీనియర్ సెకండరీ ఎడ్యుకేషన్, న్యూ ఢిల్లీ, అన్నమలై యూనివర్సిటీతో పాటు ఇతర యూనివర్సిటీలకు చెందిన మొత్తం 91 నకిలీ సర్టిఫికెట్లు, రెండు సెల్‌ఫోన్లు, రూ.1080ల నగదును స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం డబీర్‌పురా పోలీసులకు అప్పగించారు. దీంతో డబీర్‌పురా పోలీసులు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో నిందితుడు సంజయ్ శర్మ ఆలియాస్ సాహిల్ శర్మ పరారీలో ఉన్నట్లు.. అతడిని కూడా త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట్ ఏసీపీ జి.శ్యాంసుందర్, సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ టి.స్వామి, డబీర్‌పురా నాను నాయక్, ఎస్సై ఇ.ఎస్.శ్రీధర్, సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు కవివుద్దీన్, మధు, సాయిరాం పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు జ్ఞాపికను అందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మణికొండ: విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్ది సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్ గ్రామంలోని విద్యావికాస్ ఉన్నత పాఠశాల 30వ వార్షికోత్సవం గురువారం రాత్రి జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించినప్పుడే వారికి ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్‌ముదిరాజ్, మండల విద్యాధికారి విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ టి.హేమలత, కరస్పాండెంట్ టి.రాములు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

4వ వీర్ చంద్రశేఖర్ ఆజాద్ రెజ్లింగ్ పోటీలు ప్రారంభం

జియాగూడ: 4వ వీర్ చంద్రశేఖర్ ఆజాద్ కుస్తీ పోటీలను ఘనంగా ప్రారంభించినట్లు నిర్వాహకులు మెడికల్ డిపార్ట్‌మెంట్ మహారతి కరన్ ఉస్తాద్ గులాబ్ వ్యాయామశాల ధరం సింగ్ పహిల్వాన్ అన్నారు. గురువారం జియాగూడ ఎంసీహెచ్ గ్రౌండ్‌లో వీర్ చంద్రశేఖర్ ఆజాద్, బోల్ సింగ్ కేసరి టైటిల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా చైర్మన్ జి.గులాబ్ సింగ్, అధ్యక్షుడు బి.కైలాష్ సింగ్, ఉపాధ్యక్షులు బి.ప్రతాప్ సింగ్, కె.దయానంద్ చౌదరి, సురేందర్ సింగ్, ప్రధాన కార్యదర్శి డి.రాజ్‌కుమార్, కోశాధికారి మహేందర్‌సింగ్, కార్యదర్శి బన్సీలాల్ ఉస్తాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అజయ్ సింగ్, సలహాదారుడు లకన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణల కూల్చివేత



గోల్కొండ: టోలిచౌకీ హకీంపేట్, సాలర్‌బ్రిడ్జీ తదితర ప్రాంతాల్లో బల్దియా వారు అనుమతులు లేని కట్టడాలను, ఫుట్‌పాత్ ఆక్రమణలను కూల్చివేశారు. బల్దియా కార్వాన్ సర్కిల్ ఖైరతాబాద్ జోన్ బృందం టోలిచౌకీ ఫ్లై ఓవర్, హకీంపేట్ సాలర్ బ్రిడ్జీ తదితర ప్రాంతాల్లో వెలిసిన ఆక్రమ కట్టడాలను, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను కూల్చివేశారు. కాగా ఈ కూల్చివేతలపై స్థానిక వ్యాపారులే కాక టోలిచౌకీ హకీంపేట్‌కు చెందిన వివిధ బస్తీలు, కాలనీల వాసుల నుంచి హర్షం వ్యక్తం అవుతుంది.

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి

నాంపల్లి: ఎంఎంటీఎస్ రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన హైదరాబాద్ ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సుమారు 30 ఏళ్ల వయస్సు కలిగిన ఓ గుర్తు తెలియని యువకుడు ఖైరతాబాద్-లక్డీకాపూల్ రైల్వేస్టేషన్ల మధ్యలో పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీ కొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై తెలుపు చొక్కా, లేత గోధుమ రంగు ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు


అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ నర్సింగ్‌రావు

సుల్తాన్‌బజార్: యువత డ్రగ్స్‌కు బానిసై తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హెచ్ఎన్‌పీఎస్ డీఎస్పీ నర్సింగ్‌రావు సూచించారు. గురువారం హనుమాన్ టేక్డీలోని ప్రగతి మహా విద్యాలయలో విద్యార్థులకు డ్రగ్స్ వ్యసనంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ విలువైన విద్యార్థి దశలో తమ భవిష్యత్తు కోసం ప్రణాళికలు రచించాలని సూచించారు. ఈ దశలో తంబాకు, డ్రగ్స్, ఆల్కాహాల్ లాంటి వ్యసనాలకు బానిస కావొద్దని సూచిచ్చారు. విద్యా సంస్థల్లో డ్రగ్స్ వాడకంపై పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి కళాశాలలో నో డ్రగ్స్, నో ఆల్కాహాల్, నో టొబాకో అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో సాంస్కృతిక సంబరాలు


వేడుకల్లో కన్వీనర్ ముఖైర్ హైదర్, జాయింట్ కన్వీనర్ శ్రీనివాస్

అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో జోరుగా సాంస్కృతిక సంబరాలు నిర్వహించారు. 16వ శతాబ్దాలంలోని గోల్కొండ కులీకుతుబ్‌షా హయాంలోని చారిత్రాత్మక సంపదలపై కార్యక్రమాలు చేపట్టారు. సందర్శకులకు చారిత్రక సంపదపై అవగాహన కల్పించి అలనాటి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ముఖైర్ హైదర్, జాయింట్ కన్వీనర్ పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆనంద్‌రావు


ఆనంద్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆచార్యులు

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలోని ప్రభుత్వ లలిత కళల కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఎంఎల్ ఆనంద్‌రావును ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆయనకు తోటి ఆచార్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్‌రావు మాట్లాడుతూ..విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన గుణాత్మకమైన విద్యను అందించి వారు జీవితంలో త్వరితగతిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, జె.వెంకటేశ్వర్లు, కె.హరీష్‌బాబు, కె.కాంతారెడ్డి, ఆనంద్ గడప, సతీష్‌కుమార్, వేణు మనోహర్‌తో పాటు యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

శివసేనారెడ్డికి సన్మానం



గోల్కొండ/జియాగూడ: సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ క్రీడారంగానికి ప్రోత్సాహం పెరిగిందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివ సేనారెడ్డి అన్నారు. కార్వాన్ కాంగ్రెస్ ఏ-బ్లాక్ అధ్యక్షుడు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా జియాగూడ మున్సిపల్ గ్రౌండ్‌లో 4వ వీర్ చంద్రశేఖర్ ఆజాద్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు రావాల్సిందిగా ఈ సందర్భంగా ఆయనను కోరారు. శివసేనారెడ్డి మాట్లాడుతూ..గత సంవత్సర కాలంలో తెలంగాణ క్రీడాకారులు తమ తమ రంగాల్లో సత్తాచాటి జాతీయ స్థాయిలో సైతం రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముంగి రఘుపాల్‌రెడ్డి, అబ్దుల్ హమీద్, సరమ్‌సింగ్, జె.నర్సింగ్, కురాకుల రఘువీర్, జి.కిషన్, రాంకుమార్, తదితరులున్నారు.

పీసీఓడీపై మహిళలకు అవగాహన



చార్మినార్: మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని రంగాల్లో ఆశించిన ఫలితాలు సాధించడానికి వీలు కలుగుతుందని ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ అండ్ ప్రోగ్రాం ఆఫీసర్ యూనిట్-2, కన్వీనర్ డాక్టర్ శ్రీదేవి అన్నారు. ఆరోగ్యమే లక్ష్యంగా గురువారం సిటీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం, ఎన్ఎస్ఎస్ సంయుక్తాధ్వర్యంలో శ్రీ సత్య సాయి సేవా సమితి సహకారంతో ఉమెన్ వెల్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పీసీఓడీపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్ అధ్యక్షత వహించగా..రిసోర్స్ పర్సన్‌గా డాక్టర్ సరస్వతి వ్యవహరించి పీసీఓడీపైన మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మహిళలు ఆరోగ్యంగా ఉండడానికి రోజు వారి వ్యాయామం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కృష్ణచంద్ర కీర్తి, డాక్టర్ తిరుపతి, డాక్టర్ నాగరాజు లతో పాటు అవధానం సుజాత, అనసూయ, ప్రసన్న పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్వాన్, జియాగూడ, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ విధంగా వచ్చిన మహిళల్లో ఎక్కువ మంది ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, పింఛన్‌లు తదితర విషయాలపై ఎమ్మెల్యే వద్ద తమ గోడును విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న వారు ఆందోళనకు గురి కావద్దు అని అర్హులైన వారికి ఇల్లు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు.

విద్యుత్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి..

విద్యుత్ శాఖకు చెందిన అధికారులు తమ తమ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. గురువారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఆయన అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గత కొన్ని నెలల క్రితం తాను ఇదే విధంగా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించానని ఆ సమావేశంలో తాను సూచించిన సమస్యలు ఇంకా అపరిష్కృతంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, డీఈ టి.సుధాకర్, ఏడీఈ ఆర్.బిక్కు, మాధవరావు, మహ్మద్ యాకుబ్‌బాషా, మహ్మద్ జాఫర్, ఏడీఈ శంకర్‌నాయక్ తదితరులున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మదనపల్లె: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. జియాగూడకు చెందిన కరణ్ సింగ్, నందిని దంపతుల కుమారుడు దీపక్ సింగ్(28). ఏడు నెలల క్రితం మదనపల్లెకు వెళ్లి రెడ్డప్ప నాయుడు కాలనీ క్రాస్ రోడ్‌లో ఉన్న మిస్టర్ ఇరానీ టీ దుకాణంలో మాస్టర్‌గా చేరాడు. సిటిఎం రోడ్డులో ఉన్న బిల్డింగ్‌లోని మూడవ అంతస్తులో మరో టీ మాస్టర్ సురేష్‌తో కలిసి ఉంటున్నాడు. బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో తల్లి నందినితో ఫోన్లో మాట్లాడాడు. తనకు ఆరోగ్యం సరిగా లేదని, ఛాతిలో నొప్పిగా ఉందంటూ చెప్పాడు. రాత్రి 8 గంటల తర్వాత తల్లి మరోసారి ఫోన్ చేయగా సమాధానం రాలేదు. విధులకు రాకపోవడంతో హోటల్ యజమాని.. దీపక్ సింగ్ ఉంటున్న గది వద్దకు సురేష్‌ను పంపారు. అక్కడికి వెళ్లిన సురేష్ గదిలో దీపక్ సింగ్ అపస్మారక స్థితిలో బెడ్‌పై పడిపోయి ఉండడాన్ని గమనించాడు. వెంటనే యజమానికి, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న టూ టౌన్ పోలీసులు దీపక్ సింగ్‌ను పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉండటంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సమాచారాన్ని తెలపడంతో కుటుంబ సభ్యులు మదనపల్లికి చేరుకుని టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీపక్‌సింగ్ మృతికి గల కారణాలను పోస్టు మార్టం నివేదిక తర్వాత వెల్లడించగలమని సీఐ రామచంద్ర తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.